సాక్షి
బాపట్ల
శనివారం । 6 । మే । 2023



వేంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు

మంగళగిరి: ద్వారకా తిరుమలలో వేంచేసిన వేంకటేశ్వరస్వామికి మంగళగిరి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టు వస్త్రాలు, అమ్మవారికి సారె బహూకరించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.



వైభవంగా లక్ష మల్లెల అర్చన

నరసరావుపేట రూరల్: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామివారికి శుక్రవారం రాత్రి లక్ష మల్లెల అర్చనను వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

శింగరకొండలో హైకోర్టు జడ్జి పూజలు



ప్రసన్నాంజనేయస్వామికి పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి పీవీ జ్యోతిర్మయి దంపతులు

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామిని శుక్రవారం హైకోర్టు జడ్జి పీవీ జ్యోతిర్మయి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన అర్చకులు, సిబ్బంది జడ్జి దంపతులను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అర్చకులు జడ్జి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి బాబునాయక్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: ప్రభుత్వం పసుపు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. శుక్రవారం వేమూరులో ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గ స్థాయిలో మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పసుపునకు మద్దతు ధర రూ.6,900 కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడి పసుపు కొనుగోలు కేంద్రానికి అనుమతి తీసుకొని రావడం జరిగిందని మంత్రి తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం పసుపు రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారన్నారు. వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన ఎంఏ తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్‌వర్క్, జర్నలిజం, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, మాథమాటిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్స్ అండ్ న్యూట్రీషనల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎంకాం, బీఎల్‌ఐఎస్సీ, ఎంఎల్‌ఐఎస్సీ, ఎంబీఏ ఎల్‌ఎల్‌ఎం కోర్సుల పరీక్షా ఫలితాలను శుక్రవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ విడుదల చేశారు. ఫలితాలను www.anucde.info వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. జవాబుపత్రాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 19 ఆఖరు తేదీగా నిర్ణయించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్ జైనులాబ్దీన్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు ఏఎన్‌ఎంలు సరెండర్

కొల్లూరు: ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త నడుమ చోటు చేసుకున్న వివాదం.. ఓ ఏఎన్‌ఎంపై మరో ఏఎన్‌ఎం చేసిన ఫిర్యాదుల మేరకు ఇరువురు సచివాలయ ఏఎన్‌ఎంలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి సరెండర్ చేయాలని సంబంధిత శాఖ అధికారుల నుంచి వైద్యాధికారి రవిబాబుకు ఆదేశాలు అందాయి. గత కొంత కాలంగా కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, వైద్యాధికారి, సిబ్బంది నడుమ అంతర్గతంగా వివాదాలు నెలకొని ఉన్నాయి. వైద్యాధికారికి సన్నిహితంగా ఉంటున్న కొందరు సిబ్బందిపై ఆధిపత్యం చేస్తుండటం వివాదాలకు కారణంగా విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఏఎన్‌ఎంలను సరెండర్ చేయడం పీహెచ్‌సీ సిబ్బంది అంతర్గత వివాదాన్ని బహిర్గతం చేస్తుంది. కొల్లూరు సచివాలయం–2లో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న శ్రీలక్ష్మి, వైద్యాధికారి డి.రవిబాబుపై అనంతవరం సచివాలయంలో పని చేస్తున్న ఏఎన్‌ఎం పీఎస్‌టీ కుమారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనికి తోడు అనంతవరం ఏఎన్‌ఎం పీఎస్‌టీ కుమారికి అక్కడి ఆశ కార్యకర్తకు నడుమ వివాదం నడుస్తుండటంతో గతంలో ఇరువురు ఒకరిపై ఒకరు కొల్లూరు పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నారు. ఈసంఘటనలపై స్పందించిన వైద్య శాఖాధికారులు ఇరువురు ఏఎన్‌ఎంలను సరెండర్ చేయాలని వైద్యాధికారి రవిబాబును ఆదేశించారు. ఈ సంఘటనపై వైద్యాధికారి మాట్లాడుతూ, అధికారుల ఆదేశాల మేరకు ఏఎన్‌ఎంలు ఇద్దరిని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సరెండర్ చేయనున్నట్లు తెలిపారు.

పేదల ఇంటి పండుగ

- మరో రెండువారాల్లో పంపిణీ
- అడ్డంకులను ఎదుర్కొని ముందుకెళ్లిన ప్రభుత్వం
- హైకోర్టు ఆదేశాలతో పేదలకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు, ప్రజాసంఘాలు

అమరావతిలో ఇళ్ల స్థలాలకు లైన్ క్లియర్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ సాక్షి నెట్‌వర్క్: గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని సుమారు 48 వేల కుటుంబాలకు పండుగొచ్చింది. ఇప్పటివరకూ సొంతింటి స్థలం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న పేదలకు హైకోర్టు తీర్పు ఆనందదాయకమైంది. పేదలకు తమ ప్రాంతంలో ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యం దెబ్బతింటుందంటూ కొంతమంది రైతుల ముసుగులో కోర్టును ఆశ్రయించడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియకు జాప్యం జరిగింది. రైతుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన ప్రయత్నానికి ప్రభుత్వం, హైకోర్టు అడ్డుకట్ట వేశాయి. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండటానికి వీల్లేదు అనే దుర్మార్గమైన ఆలోచనతో తెలుగుదేశం నాయకులే రైతుల పేరుతో పిటీషన్ దాఖలు చేసి పట్టాలు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు హైకోర్టు తీర్పుతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజా సంఘాలు కూడా ఈ తీర్పును స్వాగతించాయి.




అమరావతి ప్రాంతంలో ఇళ్ల స్థలాల చదును కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి(ఫైల్).



ముమ్మరంగా జరుగుతున్న చదును పనులు

ఇది ప్రజా విజయం



పేదల పక్షాన ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఖచ్చితంగా ప్రజా విజయమే. రాష్ట్ర ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో అణగారిన వర్గాలకు మేలు చేయాలనే తలంపుతో ముందుకు వెళ్లింది. టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా ఆఖరికి పేదలకు మేలు జరిగేలా తీర్పు రావడం హర్షణీయం.

– చెన్నంశెట్టి చక్రపాణి, విశ్రాంత ఎస్పీ

ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నాం



ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థలం కోసం అర్జీ పెట్టుకున్నా. ఇంటికి వచ్చిన అధికారులు విచారించి ఇంటి స్థలం ఇస్తామని చెప్పారు. రెండేళ్లుగా ఎదురు చూస్తున్నా. త్వరలో రాజధాని ప్రాంతంలో ఇంటి స్థలం వస్తుందని ఎదురు చూస్తున్నాం.

– పెద్దపల్లి ఏసు మరియమ్మ, ఉప్పలపాడు

చంద్రబాబు అండ్ కోకు చెంపపెట్టు లాంటి తీర్పు



రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి ప్రభుత్వం ఇచ్చిన జీఓ నం. 45కి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడాన్ని అడ్డకుంటూ హైకోర్టును ఆశ్రయించిన చంద్రబాబు అండ్ కో కు ఇది చెంపపెట్టు లాంటి తీర్పు.

– డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, ఐడియా జాతీయ అధ్యక్షుడు

హైకోర్టు తీర్పు హర్షణీయం



రాజధాని ప్రాంతంలో పేదలకు, దళితులకు, దళిత క్రైస్తవులకు ఇళ్ల స్థలాలు కేటాయించవచ్చంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించి వారికి తగిన భరోసా కల్పించాలనే సీఎం వైఎస్ జగన్ ఆలోచన విధానానికి అడ్డుపడిన వారికి ఈ తీర్పు ఒక గుణపాఠం లాంటిది.

– సోమి కమల్, రెల్లి సామాజిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు

రోడ్డు పక్కన గుడిసెల్లో ఉంటున్నాం..



రోడ్డు పక్కన గుడిసెలు వేసుకుని నివాసాలు ఉంటున్నాం. తెనాలి నందివెలుగు రోడ్డు విస్తరణకు సహకరించి రోడ్డుకు రెండు పక్కల ఉంటే వారంతా ఆరు అడుగుల స్థలాన్ని ఇచ్చాం. మా ఇళ్లు అనుకుని రాత్రింబవళ్లు లారీలు, బస్సులు తిరుగుతున్నాయి, ఎప్పుడు ఏ వాహనం ఇళ్లలోకి చొరబడుతుందోనని భయం భయంగా గడుపుతున్నాం. మాకు త్వరగా ఇళ్ల స్థలాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– కగ్గా సుధారాణి, తక్కెళ్లపాడు

హైకోర్టు తీర్పు అభినందనీయం..



రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై హైకోర్టు తీర్పు అభినందనీయం. రాజధాని ప్రాంతం అభివృద్ధిలో అందరూ భాగస్వాములుగా ఉండాల్సిందే. అన్నివర్గాల ప్రజలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజామోదయోగ్యంగానే ఉంటుంది.

– మిరియాల గోపీకుమార్, కాపునాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు

టీడీపీ నాయకులకు ఇష్టం లేదు..



అద్దెలు కట్టలేక అల్లాడుతున్నాం. ఎక్కడ ఇంటి స్థలం ఇస్తే అక్కడకు వెళతాం. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం టీడీపీ నాయకులకు ఇష్టం లేదు. వాళ్లు ఇవ్వరు.. ఇచ్చేవాళ్లను ఇవ్వనీయరు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఆయనకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని అడ్డుకుంటున్నారు. మాకు ఎక్కడ ఇళ్ల స్థలం వస్తుందో, ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని వాళ్లకు భయం.

– షేక్ షబానా, పెదకాకాని

కంటిపై కునుకు కరువు

- వీడని వర్షంతో రైతులకు ఇబ్బందులు
- కోతల దశలో ఉన్న మొక్కజొన్న, జొన్న, వరి
- పలు చోట్ల కల్లాల్లోనే పంట ఉత్పత్తులు
- గత 24 గంటల్లో సగటున 17.2 మిల్లీ మీటర్లు వర్షపాతం
- పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేస్తున్న అధికారులు
- తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆందోళనలో రైతులు
- అప్రమత్తమైన అధికారులు



వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, కొరిటిపాడు: అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గత ఐదు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తూనే ఉంది. ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు మించడం లేదు. మే నెల ఆరంభంలో ఎండలు విపరీతంగా ఉంటాయని భావించినప్పటికీ అకాల వర్షంతో ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించింది. వాతావరణం అప్పుడప్పుడు తెరపివ్వటంతో రైతులు కల్లాల్లో ఉన్న పంట సంరక్షణ, సస్యరక్షణ చర్యల వైపు దృష్టి పెట్టారు. మళ్లీ తుఫాను ముంచుకొస్తుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ద్రోణి ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఐదు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, జొన్న, మిర్చి, పసుపు, పంట మీద ఉన్న మొక్కజొన్న, జొన్న చేలకు నష్టం వాటిల్లింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా సగటున 17.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. మరోవైపు మరో రెండురోజుల్లో బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడనుందన్న వార్తలు రైతాంగాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

మొలకలు.. ఫంగస్...

రబీ సీజన్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 1.02 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 7 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేశారు. అయితే గుంటూరు జిల్లాలోని తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, చేబ్రోలు, కాకుమాను, మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, పెదకాకాని, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లో 3,347 హెక్టార్లలో పంట మీద ఉన్న మొక్కజొన్న, జొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనాలు వేశారు. (మొక్కజొన్న 2,119 హెక్టార్లు, జొన్న 1,223 హెక్టార్లు, ధాన్యం ఐదు హెక్టార్లు ఉంది.) అలాగే తాడేపల్లి మండలంలో మరో ఆరు హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పలు చోట్ల కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు, కండెలు మొలకలు వచ్చాయి. జొన్న కంకులకు ఫంగస్ వ్యాపించి కంకులు నలుపు మారిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పంట నాణ్యత దెబ్బతింటుందని మార్కెట్‌లో ధర ఏ మేరకు అందుతుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. వ్యవసాయ అధికారులు, లాం ఫాం శాస్త్రవేత్తలు పంట నష్టం గుర్తించే పనిలో నిమగ్నం కావడంతో పాటు రైతులకు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

పల్నాడు జిల్లాలో 457.4 హెక్టార్లలో నష్టం...

పల్నాడు జిల్లాలో ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలకు నకరికల్లు, ముప్పాళ్ల, బెల్లంకొండ, రాజుపాలెం, బొల్లాపల్లి మండలాల్లో 419.4 హెక్టార్లలో వరి, 30 హెక్టార్లలో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 8 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

బాపట్ల జిల్లాలో...

అకాల వర్షాలకు బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలంలో 2000 ఎకరాలలో మొక్కజొన్న పంట నేలవాలిపోయి నష్టం వాటిల్లింది. అదే మండలంలో కల్లాల్లో ఉన్న మొక్కజొన్న విత్తనాలు 1800 క్వింటాళ్లు తడిసిపోయి మొలకలు వచ్చినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

చేబ్రోలులో 77 మి.మీ వర్షం...

గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 77 మిల్లీ మీటర్లు వర్షంపడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 0.2 మి.మీ వర్షం పడింది. సగటున 17.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గుంటూరు తూర్పులో 76 మి.మీ., ఫిరంగిపురం 34.2, గుంటూరు పశ్చిమ 31, పొన్నూరు 27.8, పెదకాకాని 23.8, వట్టిచెరుకూరు 14.8, మేడికొండూరు 13.2, ప్రత్తిపాడు 5.2, పెదనందిపాడు మండలంలో 2 మి.మీ చొప్పున వర్షం పడింది.

కొత్త దంపతులకు కొండంత అండ

పేద జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా చెక్కుల అందజేత



కల్యాణమస్తు, షాదీ తోఫా చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా

బాపట్ల: నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికే వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా లబ్ధిదారులైన నూతన దంపతులకు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని లబ్ధిదారులతో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడగా.. బాపట్ల మండలానికి చెందిన కాకి కల్పన రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, శాసన మండలి సభ్యురాలు పోతుల సునీత, శాసనసభ్యుడు కోన రఘుపతి చేతులమీదుగా జిల్లాలోని లబ్ధిదారులకు నగదు చెక్కును అందజేశారు.

పేదలు ఆత్మస్థైర్యంతో బతుకుతున్నారు..

పేదలు ఆత్మస్థైర్యంతో బతకడానికి ముఖ్యమంత్రి నగదుతో పాటు నమ్మకాన్ని ఇచ్చారని శాసనసభ్యుడు కోన రఘుపతి చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలతో గొప్ప మనసున్న నాయకుడిగా ప్రజలలో నిలిచారన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికే వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకంలో సీఎం మార్పులు తెచ్చారన్నారు. పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు పారదర్శకంగా పథకాల లబ్ధిచేకూరుస్తున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లాలో 226 మంది నూతన దంపతులకు రూ.1.80 కోట్ల నగదు విడుదలయిందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ పేద కుటుంబాలలో వివాహం చేసుకున్నవారికి ఆర్థిక సహాయం చేయడం సంతోషదాయకమన్నారు. పేద కుటుంబాలవారికి ఇంటి పెద్ద అన్నగా రాష్ట్ర ముఖ్యమంత్రి అండగా నిలిచారన్నారు. డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారిణి రాజదెబోరా, డీఆర్‌డీఏ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైభవం.. భావదేవుడి రథోత్సవం

బాపట్ల: భావపురి నడిబొడ్డున కొలువుతీరిన భావదేవుడి రథోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావనారాయణ స్వామివారికి తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆలయ అర్చకులు, బ్రహ్మణుల సమక్షంలో అంగరంగవైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారిని గరుడవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నుంచి 1430వ నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, ఆయన సతీమణి రమాదేవి, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్,



టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మరాజులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు బాపట్ల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో భావన్నారాయణ స్వామి దేవాలయానికి తరలిరావడంతో రథం బజార్ సెంటర్ కిక్కిరిసిపోయింది. భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపట్టారు.

ధాన్యం, మొక్కజొన్న సత్వరం కొనుగోలు చేస్తాం

జిల్లా ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్

బాపట్ల: ధాన్యం, మొక్కజొన్న పంటలను సత్వరమే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్ వెల్లడించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, సంబంధిత జిల్లా అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల వద్ద మూడు రోజుల్లో రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. జిల్లాలో దెబ్బతిన్న పసుపు, మిర్చి, మొక్కజొన్న పంటలపై సర్వే చేసి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం, మొక్కజొన్న పంటలను తక్షణమే రైతు భరోసా కేంద్రాల వద్ద



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్, పక్కన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కొనుగోలు చేస్తామని, అవసరమైన గోనె సంచులు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దిష్టమైన సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. జిల్లాలో 62 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ప్రస్తుతం 10,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామనే విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయ్యిందన్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో 30 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట తడిచి నష్టం వాటిల్లిందన్నారు. 10,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయాలని ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. పంటల కొనుగోలుకు నాలుగు లక్షల గోనె సంచులు సిద్ధంగా ఉంచామన్నారు. బాపట్ల జిల్లా లో 2,173 మెట్రిక్ టన్నుల మిర్చి ఉత్పత్తి జరిగిందన్నారు. పసుపు పంట 1,590 మెట్రిక్ టన్నులు సాగు చేశారన్నారు. పంట నష్టంపై యుద్ధప్రాతిపదికన సర్వేలు నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, బాపట్ల ఆర్డీఓ జి రవీందర్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, డీఎస్ఓ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీహెచ్‌సీ వైద్యాధికారుల సంఘం కార్యవర్గం



బాపట్ల: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారుల సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా డాక్టరు రాజేష్‌కుమార్, కార్యదర్శిగా కిరణ్‌కుమార్, ట్రెజరర్‌గా డాక్టరు అఖిలేష్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అనంతరం జిల్లా వైద్యాధికారిణి డాక్టరు ఎస్.విజయమ్మను మర్యాదపూర్వకంగా కలిసి అసోసియేషన్ సభ్యుల జాబితాను అందించారు.

వాహనాలకు త్రైమాసిక పన్నులు చెల్లించాలి

పట్నంబజారు(గుంటూరు): జిల్లాలో వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్నులు చెల్లించాల్సిన యజమానులు త్వరగా చెల్లించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం చెప్పారు. ఈమేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రవాణా వాహనాలు కొన్ని పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నాయని, అటువంటి వాహనాలను పన్నులు చెల్లించకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఆ వాహన యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, ఇకపై ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని వివరించారు. తనిఖీల్లో పట్టుబడితే త్రైమాసిక పన్నుతోపాటు 200 శాతం అధికంగా జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కచ్చితంగా ప్రతి ఒక్క వాహన యజమాని పన్నులు చెల్లించాలని సూచించారు.

గంజాయి కట్టడికి పటిష్ట చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్
- ప్రాపర్టీ నేరాలు జరగకుండా బీట్ వ్యవస్థ పటిష్టం
- రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికపై నిఘా
- పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

చినగంజాం: గంజాయి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన చీరాల సబ్ డివిజన్ పరిధిలోని చినగంజాం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ముందుగా ఆయన సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసుస్టేషన్‌లోని పరిసరాలను వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన కేసు ప్రాపర్టీని, వాహనాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు నిర్వహిస్తున్న విధులు గురించి మహిళా పోలీస్ డ్యూటీ ట్రాకర్ వెబ్‌సైట్‌లో వారి రోజువారి విధులను పొందుపరుస్తున్నారా లేదా స్టేషన్ పరిధిలో ఎటువంటి నేరాలు జరుగుతున్నాయి, రౌడీలు, అనుమానితులు, పాత నేరస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి కదలికలు గురించిన వివరాలు, స్థల వివాదాలు, కుటుంబ తగాదాలు, వర్గ విభేదాలు గురించిన సమాచారాన్ని, గతంలో ఎటువంటి నేరాలు జరిగాయి, అందులో ముద్దాయిలు, బాధితులు, వారి ప్రస్తుత జీవన విధానం వంటి విషయాలు గురించి అడిగి తెలుసుకున్నారు.

మహిళా పోలీసుల పాత్ర కీలకం

మహిళా పోలీసులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మహిళా పోలీసు డ్యూటీ ట్రాకర్ వెబ్‌సైట్‌లో వారు చేసిన విధులను వారి పరిధిలో జరిగిన కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, పాత నేరాల గురించిన సమాచారం పొందుపరచాలన్నారు. రౌడీలు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని గ్రామ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు గురించిన సమాచారం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. పోలీసుస్టేషన్‌లో నమోదవుతున్న వారి సచివాలయ పరిధిలోని కేసుల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, కేసు స్థితిగతులను ఫిర్యాది, సాక్షులు, ముద్దాయిల వివరాలు తెలుసుకోవాలన్నారు. మహిళలపై చిన్నపిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒంటరి మహిళలను గుర్తించి తరచూ వారి ఇంటిని సందర్శిస్తూ ఉండాలని సైబర్ నేరాల గురించి లోన్ యాప్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని పోలీసు సిబ్బంది వారి దత్తత గ్రామాన్ని వారానికి ఒకసారి కచ్చితంగా సందర్శించాలన్నారు. గ్రామస్తులతో మమేకమై గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చారా, వస్తే వారి వివరాలు, అసాంఘిక కార్యకలాపాలు గురించి సమాచారం తెలుసుకోవాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో రహదారులపై తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే వివిధ క్రైం రికార్డుల సీడీ ఫైల్స్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. వార్షిక తనిఖీల్లో చీరాల డీఎస్పీ ఎస్ ప్రసాదరావు, ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, సీసీ హరికృష్ణ, చినగంజాం ఎస్సై కే సురేష్, మాజీ ఎస్సై కట్టా అనూక్, ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు



కలెక్టర్ రంజిత్ బాషాతో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

చీరాల రూరల్: నూతనంగా ఎంపికైన ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు న్యాయవాది కట్టా శ్రీనివాసరావు, రాజారావు, ప్రసాద్, సురేష్‌లు శుక్రవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. సభ్యులు కలెక్టర్‌కు పూల మొక్కను అందించి సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు గురించి ఆయా కేసులకు సంబంధించిన పురోగతిని కలెక్టర్‌తో చర్చించినట్లు సభ్యులు తెలిపారు. కేసులను నిష్పక్షపాతంగా విచారణ జరిపించి దోషులను శిక్షలు పడేవిధంగా సహకరించాలని, ఆయా స్టేషన్‌ల పరిధిలోని డీఎస్పీలకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు సభ్యులు కోరారు.

బోధనతో మెరుగైన ఫలితాలు

డీఈఓ రామారావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామారావు, రజని, నాగజ్యోతి, అంబేడ్కర్ తదితరులు

బాపట్ల అర్బన్: పాఠశాలల్లో పిల్లల నమోదుతో పాటు విద్యా బోధనలో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు కోరారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జిల్లా స్థాయి జేవీకే–4 ఓరియన్‌టేషన్ ప్రోగ్రామ్ శుక్రవారం ఏబీఎం హైస్కూల్‌లో నిర్వహించారు. మండల మండల జేవీకే–4 కమిటీ సభ్యులైన ఎంఈఓ, ఎంఐఎస్, డీఈఓపీ, ఏఈ, ఏపీఎం, స్టాక్ పాయింట్ స్కూల్ హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. జేవీకే యాప్ వినియోగం, మెటీరియల్ భద్రపరచడంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాణ్యత విషయంలో విషయాలలో రాజీ పడకుండా జూన్ 12 నాటికి ప్రతి విద్యార్థికి జగనన్న కిట్ అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఈఓ సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ రజని, ఈఈ కె.వి.నాగజ్యోతి, డీఆర్‌డీఏ అధికారి ఆర్.ఎల్.అంబేడ్కర్ పాల్గొన్నారు.

గుంటూరు బాడీ బిల్డర్లకు బంగారు పతకాలు



రమేష్ శర్మ, కార్తిక్‌లను అభినందిస్తున్న చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

గుంటూరు వెస్ట్(క్రీడలు): గత నెలలో చండీఘర్, ఢిల్లీల్లో జరిగిన జాతీయ స్థాయి మెన్ ఫిజిక్ బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరుకు చెందిన హరివారి రమేష్ శర్మ, శాఖమూరి కార్తిక్‌లు పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారని డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేష్ శర్మ మూడు బంగారు, ఒక కాంస్యం, కార్తీక్ రెండు బంగారు, కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. వీరిద్దరూ స్థానిక జిమ్‌లో అరకొర వసతులతో సాధన చేసి అద్భుతాలు సృష్టించారని వివరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి

నరసరావుపేట రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మండలంలోని యల్లమంద విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్‌ను శుక్రవారం నిఖీ చేశారు. ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, సిబ్బంది పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యం దిశగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలయ్యే గ్రామాల్లో ముందు రోజే ప్రజలకు సమాచారం తెలియజేసే విధంగా ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌లు సమావేశం ఏర్పాటు చేసుకొని వలంటీర్ల ద్వారా గ్రామంలోని ప్రజలకు సమాచారం తెలియజేయాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల అనతరం ఆ వివరాలను ఎంఎ హెల్త్ యాప్, ఎంఎల్‌హెచ్‌పీ యాప్‌లో నమోదు చేయాల్సి ఉండటంతో హెల్త్ సెంటర్‌లో విధుల్లో ఉన్న వైద్యుడు, సిబ్బంది వద్ద ఉన్న యాప్‌లను పరిశీలించారు. గ్రామస్తులకు సమాచారం లేక రోగులు రాకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను మందలించారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే ఎంత వరకు చేశారని సిబ్బందిని ప్రశ్నించారు. నెలలో రెండు సార్లు డాక్టర్‌లు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంలో గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకునేలా అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. వైద్యులు తొలిసారి గ్రామాన్ని సందర్శించిన సమయంలోనే రోగులకు వైద్య పరీక్షలు పూర్తిచేసి మందులు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారిణి శోభారాణి, మండల స్పెషల ఆఫీసర్ నాగ శ్రీనివాస్, డాక్టర్ మమత, తహసీల్దార్ రమణానాయక్ పాల్గొన్నారు.

రైతు నేస్తం ఫౌండేషన్ సందర్శన

గుంటూరు రూరల్(వట్టిచెరుకూరు): భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ యువ శాస్త్రవేత్తలు 117 మంది వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోనున్న రైతునేస్తం ఫౌండేషన్‌ను శుక్రవారం సందర్శించారు. ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఆధునిక వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయంలో శిక్షణ అందించే విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న కూరగాయలు, ఆకు కూరలు, ఐదంచెల సాగు విధానాలను ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు వివరించారు. గోజాతులు, గోశాలను పరిశీలించారు. గో వ్యర్థాలతో తయారు చేసే కషాయాలు, ఉత్పత్తుల గురించి ఆరాతీశారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్, చిరుధాన్యాలతో తయారు చేసే వంటల గురించి అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల తయారీ, వానపాముల ఎరువుల తయారీ తదితరుల యూనిట్లను పరిశీలించారు.

15 నుంచి హౌస్ వైరింగ్‌లో శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి హౌస్ వైరింగ్, రిఫ్రిజరేటర్ అండ్ ఎయిర్ కండిషన్ సర్వీసింగ్‌లలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



బౌద్ధ భిక్షువుకు కేక్ అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ(గుంటూరు): బుద్ధుని బోధనలు, సిద్ధాంతాలు అనుసరణీయమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బుద్ధిజం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బుద్ధ పౌర్ణమి, బుద్ధుని పుట్టినరోజు వేడుకలకు వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యా. బౌద్ధభిక్షువులు చేసిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి బుద్ధిజం విభాగ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు అందజేశారు. వీసీ మాట్లాడుతూ బౌద్ధం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందుతోందన్నారు. విశ్వజనీయమైన బుద్ధుని సిద్ధాంతాలు నేటి సమాజానికి అవసరమని చెప్పారు. బుద్ధ పౌర్ణమి, బుద్ధుని జయంతిని వచ్చే ఏడాది నుంచి యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులందరి సమక్షంలో జరుపుతామని చెప్పారు. బుద్ధుని సిద్ధాంతాలపై అధ్యయనం, పరిశోధనలకు పలు దేశాల నుంచి బౌద్ధ భిక్షవులు ఏఎన్‌యూకు రావడం అభినందనీయమన్నారు.

ప్రసన్నాంజనేయుడికి లక్ష తమలపాలకుల పూజ



లక్ష తమలపాకుల పూజలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి శుక్రవారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం స్వామివారికి సుప్రబాత సేవ, గోపూజ బిందెతీర్థం, అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు, అర్చకులు, ఉభయ దాతలు, భక్తులు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. పరివార దేవతలైన వినాయకుడు, సుబ్రమణ్యస్వాములకు పూజలు నిర్వహించారు. 11 ఆవృతాలుగా తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం దేవస్థాన వేదపండితులు, అర్చకులు ఉభయదాతలకు, భక్తులకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో పడి ఉన్న బ్రహ్మయ్య మృతదేహం

అద్దంకి: బైకును ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రి దుర్మరణం చెందగా కుమారుడితోపాటు మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. ముండ్లమూరుకు చెందిన టీ బ్రహ్మయ్య (47) అతని కుమారుడు యాసోలా బేల్దారి వృత్తితో జీవనం సాగిస్తుంటారు. ప్రతి రోజూ గ్రామం నుంచి అద్దంకి వచ్చి బేల్దారి పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి వెళ్తుంటారు. వీరితోపాటు లక్కవరం గ్రామానికి చెందిన సుబ్బావతి వీరితో అద్దంకి వచ్చి పని చేస్తుంటుంది. ఈ క్రమంలో ముగ్గురు బైక్‌పై ఉదయం అద్దంకి వెళ్లి పనిచేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని నాలుగు చక్రాల ఆటో బైకును ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు, మహిళా కూలికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో అద్దంకి వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సమందర్ వలి దుర్ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పిడుగుపాటుతో 14 గొర్రెలు మృతి

రేపల్లె: అకాల వర్షంతో పట్టణంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం శుక్రవారం కురిసింది. ఉప్పూడి కాల్వకట్టు సమీపంలో పిడుగు పడటంతో సమీపంలోని 13వ వార్డుకు చెందిన కుంబా కృష్ణకు చెందిన 14 గొర్రెలు మృతి చెందాయి. అదే విధంగా మండలంలోని పేటేరు గ్రామ పొలాలలో కొక్కిలిగడ్డ సాంబయ్యకు చెందిన రెండు ఎకరాల వరికుప్పపై పిడుగు పడటంతో దగ్ధమైంది. గమనించిన స్థానికులు రేపల్లె అగ్నిపమాక కార్యాలయానికి సమాచారం అందించటంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

89,314 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 86,613 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 89,314 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. యార్డులో ఇంకా 60,478 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.